సాక్షి వికారాబాద్

శనివారం ; 25 ; మార్చి ; 2023



ప్రగతి బాటన పల్లెలు
దేశాభివృద్ధికి పల్లెలు సూచికలుగా మారాయని పలువురు నేతలు అన్నారు. ఉత్తమ జీపీలకు జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. 8లో▸



బ్రహ్మాండరూపా గోవిందా..
పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్‌లోని శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. 8లో▸



ప్రతీ గుంటకు పరిహారం
అకాల వర్షాలు, వడగళ్లతో నష్టపోయిన రైతుల ప్రతీ గుంటకు పరిహారం అందేలా చూడాలని ఎంపీపీ డి.వసంత అన్నారు. 9లో▸



ఉత్తమ జీపీలు 27

- రాష్ట్ర స్థాయికి అర్హత సాధించిన పంచాయతీలు
- పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, పాలన తదితర అంశాలు పరిగణనలోకి..
- వెనకబడ్డ పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలు
- ముందువరుసలో వికారాబాద్, మోమిన్‌పేట్, పరిగి, నవాబుపేట
- నేడు మంత్రి సబితారెడ్డి చేతులమీదుగా అవార్డుల ప్రదానం



రాఘవాపూర్‌లో అందంగా తీర్చిదిద్దిన పల్లె ప్రకృతి వనం

వికారాబాద్: జిల్లాలోని 27 పంచాయతీలు ఉత్తమ జీపీలుగా ఎంపికయ్యాయి. రాష్ట్ర స్థాయి పోటీలకు ఇవి అర్హత సాధించాయని అధికారులు తెలిపారు. పంచాయతీల పురోగతి, పనితీరు ఆధారంగా వీటిని బెస్ట్ జీపీలుగా ప్రకటించారు. జిల్లాలోని 566 పంచాయతీల్లో 54 జీపీలు జిల్లా స్థాయి పోటీలకు అర్హత పొందగా.. ఇందులో 27 పంచాయతీలను అవార్డులు వరించాయి. ఇవి రాష్ట్ర స్థాయి రేసులో నిలవనున్నాయి. ఇందులో ఒక్కో మండలం నుంచి మూడు గ్రామాలు స్థానం దక్కించుకోగా పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ నుంచి ఒక్క గ్రామం కూడా ఎంపిక కాలేదు. చైల్డ్ ఫ్రెండ్లీ, క్లీన్ అండ్ గ్రీన్, హెల్తీ, గుడ్ గవర్నెన్స్, సామాజిక భద్రత, ఉమెన్ ఫ్రెండ్లీ, వాటర్ సఫీషియెంట్ తదితర విభాగాల్లో అవార్డులకు ఎంపికయ్యాయి. శనివారం వికారాబాద్‌లోని డీపీఆర్సీ భవనంలో నిర్వహించనున్న కార్యక్రమంలో మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

మండలం	ఉత్తమ జీపీ
వికారాబాద్	పులుమద్ది, ఎర్రవల్లి, ద్యాచారం
బంట్వారం	యాచారం
కోట్‌పల్లి	లింగంపల్లి
మర్పల్లి	సిరిపురం, దార్గులపల్లి
మోమిన్‌పేట్	ఎన్కతల, గోవిందాపూర్, చీమల్‌దరి
ధారూరు	కేరెల్లి, చింతకుంట
పరిగి	రాఘవాపూర్, మిట్టకోడూర్, రంగాపూర్
పూడూరు	మీర్జాపూర్
దోమ	దోమ, పాలెపల్లి
కుల్కచర్ల	చాపలగూడెం
దౌల్తాబాద్	గోకఫస్లాబాద్
కొడంగల్	హస్నాబాద్
బొంరాస్‌పేట్	మెట్లకుంట
తాండూరు	ఖాంజాపూర్, గౌతాపూర్
నవాబుపేట	అత్తాపూర్, ఎల్లకొండ, మాదిరెడ్డిపల్లి

అన్ని జీపీల్లో పర్యటించి..

ఉత్తమ జీపీలుగా తీర్చిదిద్దే అంశంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, ఎంపీడీఓలకు గతంలోనే శిక్షణ ఇచ్చారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, డీఎల్పీఓ, డీపీఓ, డిప్యూటీ సీఈఓ, సీఈఓ తదితరులు అన్ని పంచాయతీల్లో పర్యటించి ఓ అంచనాకు వచ్చారు. అనంతరం ఆయా మండలాల్లో ఉత్తమ సేవలు అందించటమే కాకుండా, జాతీయ పంచాయతీ అవార్డుల ఎంపికలో ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటున్న అంశాలపై దృష్టి సారించారు. ఒక్కో మండలంలో మెరుగ్గా ఉన్న ఐదారు జీపీలను పరిశీలించి వీటిలో రెండుమూడు పంచాయతీల డాటాను అప్‌లోడ్ చేశారు. ఆయా గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి, సంతృప్తి వ్యక్తం చేసిన తర్వాత అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో పల్లె ప్రగతి పనులను లెక్కలోకి తీసుకున్నారు.

పచ్చదనం, పరిశుభ్రత ప్రాధాన్యం

ఉత్తమ పంచాయతీల ఎంపిక కోసం ఆయా గ్రామాల్లో జరిగిన ప్రగతి, తడి, పొడి చెత్త నిర్వహణ, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం, మురుగు గుంతలు లేకుండా చూసుకోవడం, రోడ్ల పరిశుభ్రత, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, హరితహారం, ఇంకుడు గుంతల తవ్వకం, విద్య, వైద్యం, బడి బయట పిల్లల గుర్తింపు, అక్షరాస్యత, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

కలెక్టర్ పర్యవేక్షణలో..



రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లాకు ఎక్కువ అవార్డులు తీసుకువచ్చేలా పనిచేస్తాం. ఇందుకోసం కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. వివిధ అంశాల్లో మెరుగ్గా ఉన్న జీపీలపై ఎక్కువ కసరత్తు చేశాం. సాఫ్ట్‌వేర్ ఇచ్చిన మార్కుల ఆధారంగా 27 జీపీలు జిల్లా ఉత్తమ జీపీలుగా ఎంపికయ్యాయి. ముందుగా ఎంపికైన జీపీలే కాకుండా ఏ గ్రామమైనా పోటీలో ఉండవచ్చు.

– తరుణ్‌కుమార్, డీపీఓ



కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో విద్యార్థుల రాస్తారోకో

'మన బడి' పనుల్లో నిర్లక్ష్యం తగదు

కుల్కచర్లలో రోడ్డెక్కిన విద్యార్థులు

కుల్కచర్ల: మన ఊరు– మన బడి పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రోడ్డెక్కారు. కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మనఊరు– మనబడి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు. దీంతో మౌలిక వసతులు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మాతృ శాఖలకే సరైన న్యాయం చేయనిలేని వారికి మరో శాఖకు సంబంధించిన పనులు అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలకు నియమించిన మనబడి అధికారిని వెంటనే ప్రోగ్రాం నుంచి తొలగించాలని లేదంటే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వార్ల సాయికిరణ్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్ ముదిరాజ్, పీఎస్‌పీఎస్ మండల అధ్యక్షుడు హరికృష్ణ, బీజేపీ జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి గోవింద్ నాయక్, బీజేపీ మండల కార్యదర్శి చెల్లాపూర్ ఆంజనేయులు, వివిధ గ్రామాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పట్టాలు



వీసీలో పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జీఓ నంబర్ 58, 59, 76, 118 కింద అందిన దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిశీలించి, ఎంపిక చేసిన లబ్ధిదారులకు పట్టాలు అందజేయనున్నట్లు కలెక్టర్ హరీశ్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం సీఎస్ శాంతకుమారి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో దరఖాస్తుల పరిశీలన, పట్టాల పంపిణీలో కొంత జాప్యం చోటు చేసుకుందని, ఈ ప్రక్రియను తక్షణమే ప్రారంభిస్తామని తెలిపారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు జిల్లాలో సజావుగా సాగుతున్నాయన్నారు. ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా నుంచి 49,574 మంది రెగ్యులర్, 729 మంది సప్లిమెంటరీ విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 226 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశామని, ప్రశ్నాపత్రాల స్టోరేజీ కోసం 34 కేంద్రాలను ఎంపిక చేశామని సీఎస్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు టౌన్: తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, కామర్స్ బోధించేందుకు అర్హులైన గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ 55శాతం మార్కులు కలిగి ఉండాలని, బోధన అనుభవం, పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు నేరుగా కాలేజీలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

కుట్టు మిషన్ ఉచిత శిక్షణ

పరిగి: పట్టణ కేంద్రంలోని సత్యసాయి ప్రశాంతి మందిరంలో ఏప్రిల్ మొదటి వారంలో కుట్టు మిషన్ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 9490915548, 9440963519 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధిహామీ ఉద్యోగులు

అనంతగిరి: సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా తమకు కూడా పే స్కేల్ వర్తింపజేయాలని ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా జేఏసీ చైర్మన్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2022 మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించారన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ఒక విభాగమైన సెర్ప్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, పే స్కేల్ ప్రకటించిన ప్రభుత్వం ఇదే శాఖలో పని చేస్తున్న రెండో విభాగమైన ఈజీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులకు అవకాశం కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు శీను, రాజు, భీమయ్య, రత్నం తదితరులు ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రైతులకు చేయూత

అనంతగిరి: సొంత వ్యవసాయ భూమి కలిగి ఉన్న ఎస్సీలకు ఎస్సీ కార్పొరేషన్ కింద వంద శాతం సబ్సిడీతో బోరుబావులు తవ్వించి, సబ్‌మెర్సిబుల్ పంపుసెట్లతో పీఎం– ఏజేఏవై కింద ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు అందజేయాలని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని రూమ్ నంబర్ 11, 12లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకున్న వారుఅర్హులని తెలిపారు.

20 కిలోల గంజాయి పట్టివేత

అనంతగిరి: వికారాబాద్ రైల్వే పరిధిలో శుక్రవారం 20 కిలోల గంజాయి పట్టుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే జీఆర్‌పీ, ఎక్సైజ్ శాఖ అధికారులు పక్కా సమాచారంతో ఉదయం పూర్ణా ప్యాసింజర్‌లో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 3 గంజాయి సంచులను గుర్తించారు. వీటి బరువు 20 కిలోలు ఉన్నట్లు తెలిపారు. సరఫరా చేస్తున్న వ్యక్తిని వెస్ట్ బెంగాల్‌కు చెందిన వాడిగా గుర్తించారు. ఇదే రైలులో కోహిర్ రైల్వే స్టేషన్ సమీపంలో సైతం గంజాయిని పట్టుకున్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

సీపీఆర్‌పై అవగాహన

అనంతగిరి: సీపీఆర్‌పై అవగాహన పెంచుకుంటే నిండు ప్రాణాన్ని కాపాడవచ్చని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు నిత్యం ప్రజల్లో ఉంటూ పనిచేస్తారని, సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉంటే.. గుండెపోటుతో ఎవరైనా పడిపోతే కాపాడే అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఓ వ్యక్తి రామయ్యగూడ రోడ్‌లో పడిపోతే సీపీఆర్ చేసి ఆస్పత్రిలో చేర్పించడం ద్వారా బతికి బయటపడ్డాడని గుర్తుచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులరమేశ్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ వీరిని అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, వైస్ చైర్మన్ శంషాద్‌బేగం, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలు షురూ

సాక్షి, సిటీబ్యూరో: రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. తెల్లవారు జామున 4.55 గంటలకు ముస్లింలు సహర్‌తో ఉపవాస దీక్షలు ప్రారంభించారు. సాయంత్రం 6: 34 గంటలకు ఇఫ్తార్‌తో ఉపవాస దీక్ష విరమించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదుమార్లు నమాజ్‌లు, రాత్రి తరావీ నమాజులు పూర్తి చేశారు. రంజాన్ మాసం ప్రారంభంతో ముస్లింలు నివసించే ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఇటు మసీదులతో పాటు వ్యాపార సంస్థలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. చార్మినార్, నయాపూల్, అఫ్జల్ గంజ్, మల్లేపల్లి, మెహిదీపట్నం, ప్రాంతాల్లో రంజాన్ ప్రత్యేక మార్కెట్లు వెలిశాయి.

పనులు కాకుంటే.. నిధులు వెనక్కే

- ఆర్థిక సంవత్సరం ముగింపునకు వారం రోజులే గడువు
- అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లలో టెన్షన్
- ఉపాధి హామీ కింద జిల్లాకు 717 పనులు మంజూరు
- రూ.60.96 కోట్లు ఖర్చు చేయాల్సిన వైనం
- పెండింగ్‌లో 30శాతం పనులు



పూడూరు మండలం సిరిగాయిపల్లిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

వికారాబాద్: పూర్తి చేయాల్సిన పనులు.. 242, ఖర్చు చేయాల్సిన నిధులు రూ.24 కోట్లు.. గడువు వారం రోజులు. ఇదీ.. ప్రస్తుతం పంచాయతీరాజ్ అధికారుల ముందున్న టాస్క్. లేదంటే నిధులు మళ్లిపోయే ప్రమాదముంది. ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఏ మేరకు సఫలీకృతులవుతారో వారం రోజుల్లో తేలిపోనుంది. రాత్రింబవళ్లు శ్రమించి జిల్లాకు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటారా..? మాతో కాదని చేతులెత్తేసి.. నిధులను వెనక్కి పంపిస్తారా..? అనేది ప్రస్తుతం ఉత్కంఠ రేపుతోంది. గతేడాది కూడా ఇదే తరహాలో చివరి సమయంలో ఎంత హడావుడి చేసినా వందశాతం పనులు పూర్తి చేయలేకపోయారు. ఆర్థిక సంవత్సరం ముగిశాక ప్రత్యేక అనుమతి తీసుకుని పనులు చేసినా.. ఇప్పటికీ డబ్బులు విడుదల కాలేదు.

717 పనులు మంజూరు...

మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్‌లో భాగంగా జిల్లాకు 717 సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు మంజూరయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.60.96 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనుల్లో 70 శాతం పూర్తవగా 30శాతం మిగిలి ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు రూ.36 కోట్లకు సంబంధించిన 467 పనులు పూర్తి చేశారు. మరో 242 పనులు కొనసాగుతున్నాయి.

నాణ్యత ప్రశ్నార్థకం

ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏడాది పొడవునా ఉపాధి పనులు నిర్వహించగా లేబర్ కాంపోనెంట్‌కు దీటుగా మెటీరియల్ కాంపోనెంట్ పనులు పూర్తి కాలేదు. 45 రోజుల క్రితం జిల్లాకు లేబర్ కాంపోనెంట్ కింద 717 పనులు మంజూరయ్యాయి. మార్చి లోపు వీటిని పూర్తి చేయాలని నిబంధన ఉంది. నెలన్నర వ్యవధిలో ఇంత పెద్ద మొత్తంలో పనులు ఎలా చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. హడావుడిగా చేసే పనుల్లో నాణ్యతాప్రమాణాలను ఏ మేరకు పాటిస్తున్నారనేది వారికే తెలియాలి. పూర్తి చేయాల్సిన పనులు వందల్లో ఉండటం.. గడువు వారం రోజులే మిగలడంతో అధికారులు, పాలకులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నారు.

రూ.4.5 కోట్లు పెండింగ్

గతేడాది ఇదే తరహాలో ఆర్థిక సంవత్సరం చివరలో పనులు పూర్తి చేసేందుకు హడావిడి చేసినప్పటికీ ఇంకా పెద్ద సంఖ్యలో పనులు పూర్తి కాకుండా మిగిలిపోయాయి. అనంతరం స్పెషల్ పర్మిషన్ తీసుకుని ఏప్రిల్‌లో పూర్తి చేశారు. అయితే 10 నెలల తర్వాత వీటికి సంబంధించిన బిల్లులు క్లియర్ చేశారు. మరో 62 పనులకు చెందిన రూ.4.5 కోట్ల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.

నాణ్యత పాటిస్తాం

జిల్లాలో చేపట్టిన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సకాలంలో పూర్తయ్యేలా చూస్తాం. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. ఈమేరకు నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఈఈ



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

క్షయను తరిమేద్దాం

క్షయ లక్షణాలపై అవగాహన పెంచుకుని, వ్యాధిని తరిమేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని కలెక్టర్ నారాయణరెడ్డి వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వికారాబాద్‌లో చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. వైద్యశాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్, డీపీఓ తరుణ్‌కుమార్, క్షయ నిర్మూలన ప్రాజెక్టు అధికారి రవీందర్ పాల్గొన్నారు.

– అనంతగిరి



విద్యార్థుల ర్యాలీ

క్లుప్తంగా

శ్రీరామ నవమి వేడుకలకు ఆహ్వానం


ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ చైర్మన్ తదితరులు

యాలాల: శ్రీరామ నవమి సందర్భంగా జాతరకు హాజరుకావాలని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి, ఎంపీ రంజిత్‌రెడ్డికి జుంటుపల్లి రామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వానం పలికారు. నగరంలోని ఆయన నివాసానికి వెళ్లిన ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ తదితరులు ఎమ్మెల్సీకి ఆహ్వానపత్రిక అందజేశారు. ఆహ్వానించిన వారిలో ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్తలు రవీందర్‌రావు, రాఘవేందర్‌రావు, రామారావు, హన్మంత్‌రావు, పార్థసారథి రావు, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఆలయ మేనేజర్ బాల్‌రాజ్, ప్రకాశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా హరీశ్వర్‌రెడ్డి


నియామక పత్రం అందుకుంటున్న హరీశ్వర్‌రెడ్డి

బంట్వారం: యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా మాలసోమారం గ్రామానికి చెందిన హరీశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం వికారాబాద్‌లో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. అనంతరం హరీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


అనంతగిరి: అవార్డుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్


పరిగిలో సర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

ప్రగతి బాటన పల్లెలు

- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- ఉత్తమ పంచాయతీలకు జాతీయ అవార్డుల ప్రదానం

అనంతగిరి: దేశాభివృద్ధికి పల్లెలు సూచికలుగా మారాయని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చరిత్రాత్మకమైన నిర్ణయాలతో పల్లెలు ప్రగతి పథంలో దూసుకెళ్తున్నాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు అవార్డులు రావడానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులను, అధికారులను అభినందించారు. పల్లెలు పరిశుభ్రంగా పచ్చదనంతో కళకళలాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ఐకేపీ ఏపీఎం లక్ష్మయ్య, ఏపీఓ శీను, ఏఎంసీ వైస్‌చైర్మన్ శేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఉపాధి టీఏ, ఎఫ్ఏ తదితరులు పాల్గొన్నారు.


బంట్వారం: ప్రశంసా పత్రాలతో సర్పంచ్‌లు


దౌల్తాబాద్: సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు


ధారూరు: అవార్డులతో సర్పంచులు, కార్యదర్శులు

సర్పంచ్‌లకు సన్మానం

దౌల్తాబాద్: మండల స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపికైన ఏడు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమలస్వామి. ఎంపీఓ రవీందర్ తదితరులున్నారు.

27 గ్రామపంచాయతీలకు..

ధారూరు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ పంచాయతీ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డులను సాధించిన 27 జీపీల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులను ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీడీఓ చంద్రశేఖర్‌లు ఘనంగా సన్మానించి అవార్డులను అందజేశారు.

అవార్డులతో బాధ్యత పెరిగింది

బంట్వారం: జాతీయ పంచాయతీ అవార్డులతో సర్పంచ్‌లకు మరింత బాధ్యత పెరిగిందని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం బంట్వారం మండల పరిషత్ కార్యాలయంలో 11 గ్రామ పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ అంశాలను ప్రామాణికంగా తీసుకుని జాతీయ అవార్డులకు ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుర్గంచెర్వు మల్లేశం ప్రజాప్రతినిధులు, అధికారులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంతోష, ఎంపీడీఓ బాలయ్య, ఎంపీఓ విజయ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

పరిగి: గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డులకు ఎంపికైన 27 మంది సర్పంచ్‌లను శుక్రవారం ఎమ్మెల్యే సన్మానించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాల్లోని సమస్యలు చాలా వరకు పరిష్కారం అయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ రాజేందర్, ఎంపీడీఓ శేషగిరిశర్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరు మృతి

- ముగ్గురి పరిస్థితి విషమం


నుజ్జునుజ్జయిన బైకులు

పరిగి: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రూప్‌ఖాన్‌గేట్ సమీపంలోని మూలమలుపు వద్ద ఎదురెదురుగా రెండు బైక్‌లు బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో లింగంపల్లికి చెందిన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందగా రూప్‌ఖాన్‌పేట్‌కు చెందిన శ్రీనివాస్, పరిగికి చెందిన రవికాంత్‌రెడ్డి, షఫీకి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై కేసు

పరిగి: పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.భర్కత్‌పల్లి సమీపంలో శుక్రవారం కొంత మంది పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. వడ్ల శ్రీనివాస్, నర్సింహులు, కృష్ణయ్యలకు పట్టుకున్నారు.వారి వద్ద ఉన్న రూ.3,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రుణాలను సకాలంలో చెల్లించండి


మాట్లాడుతున్న ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి

- బ్యాంకు అభివృద్ధికి తోడ్పడండి
- రైతు సేవా సహకార సంఘం చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దేముల్: రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తేనే బ్యాంకు అభివృద్ధి బాటలో కొనసాగుతుందని రైతు సేవా సహకార సంఘం చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మూ డేళ్లుగా పర్మినెంట్ ఎండీ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదన్నారు. సంఘంలో 2,450 మంది సభ్యులలో 1518 మంది రైతులు రుణ మాఫీకి అర్హులన్నారు. రూ.50 వేల రుణమాఫీకి 323 మంది రైతులకు ప్రభుత్వం రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేయాల్సి ఉండగా అందులో 232 రైతులకు రూ.87,64,010 నిధులు మాత్రమే మంజూరు చేశారన్నారు. రూ.90వేల రుణమాఫీడబ్బులు ప్రభుత్వం ఇప్పటికి అందలేదని చైర్మన్ తెలిపారు. ప్రస్తుతం రైతు సేవా సహకార సంఘం రూ.25 లక్షల లాభాల బాటల్లో కొనసాగుతోందన్నారు. బ్యాంకుల్లో కొత్త రుణాలు లేకపోవడంతో పెట్టిన షేర్ డబ్బులను తిరిగి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారని పలువురు డైరెక్టర్లు తెలిపారు. కనీసం ఎరువులు, విత్తనాలు కూడా అందజేయడంలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల రుణం మాఫీ చేస్తామని చెప్పి నాలుగేళ్లు అవుతున్నా ఎందుకు మాఫీ చేయడం లేదని రైతులు వాపోతున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున్, మేనేజర్ మురళీగౌడ్, డైరక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

అనంతగిరి: ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాలను ప్రతీ నెల 1వ తేదిన చెల్లించడంతో పాటు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి డీటీఓకు వినతిపత్రం అందజేశారు. మూడు రోజులలో పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే నగరంలోని డీటీఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సప్లిమెంటరీ బిల్లులు, పీఆర్‌సీ బకాయిలు, సరెండర్ లీవులు, పెన్షన్‌దారుల బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ మొదలగు బిల్లులన్నీ ట్రెజరీ ఆమోదం పొందిన ప్పటికీ ఎనిమిది నెలలుగా ఉపాధ్యాయులకు ఖాతాల్లో జమ కాలేదన్నారు.

గుప్త నిధుల తవ్వకాలపై ఫిర్యాదు


శివాలయంలో గుప్త నిధుల తవ్వకాలు

బంట్వారం: కోట్‌పల్లి మండలం ఎన్నారం శివారులో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు శుక్రవారం వెలుగుచూసింది. పురాతన శివాలయం ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన విషయాన్ని గ్రామస్తులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ సత్యనారాయణరాజు వెంటనే తహసీల్దార్ అష్ఫక్‌రసూల్ దృష్టికి తీసుకు వెళ్లారు. పోలీసులు, ఆర్ఐ రమేశ్ అక్కడికి వెళ్లి తవ్వకాలను పరిశీలించారు. ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్ఐ సత్యనారాయణరాజు చెప్పారు.

బ్రహ్మాండరూపా గోవిందా..

- గరుడవాహనంపై ఊరేగిన గోవిందుడు
- మారుమోగిన గోవిందనామాలు
- వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం


హనుమంత వాహనంపై శ్రీరామ చంద్రుడు

కొడంగల్: బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పేదల తిరుపతిగా పేరుగాంచిన బాలాజీనగర్ వెంకన్న స్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అర్చక స్వాములు స్వామివారికి విశేష పూజలు చేశారు. గురువారం రాత్రి 11 గంటలకు గరుడ వాహన సేవ జరిగింది. జాతర స్థలం వరకు వాహన సేవ కొనసాగింది. దారిపొడవునా భక్తులు దర్శించుకొని తరించారు.

వైభవంగా లంకాదహనం

వేంకటేశ్వరస్వామి జాతర స్థలంలో లంకా దహన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆద్యంతం భక్తుల ఆనందోత్సాహాల మధ్య కనులపండువగా కొనసాగింది. రంగు రంగుల టపాసులు ఆకాశంలో కనువిందు చేశాయి. మూఢ నమ్మకాలను పారదోలుతూ మత విశ్వాసాలను పెంపొందించే విధంగా సాగిన లంకాదహనం భక్తులను అలరించింది. చెన్నై నుంచి ప్రత్యేకంగా తెప్పించిన టపాసులను జాతర స్థలంలో కాల్చారు. రంగు రంగుల వెలుగులు భక్తులను ఆకట్టుకున్నాయి.

హనుమంత వాహనంపై శ్రీరాముడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారు శుక్రవారం ఉదయం శ్రీరామచంద్రమూర్తి అవతారంలో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం నుంచి జాతర స్థలం వరకు స్వామి వారి వాహన సేవ కొనసాగింది. దారిపొడవునా భక్తులు ఉత్సవమూర్తులకు పూజలు చేశారు.వెంకన్న స్వామి సన్నిధిలో ఉత్సవమూర్తులకు అభిషేకం ,వసంతోత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

వైభవంగా ఊయలసేవ


స్వామివారిని దర్శించుకుంటున్న విద్యార్థులు

కొడంగల్ రూరల్ : స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఊంజల మండపంలో స్వామివారి ఊయల సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి గోల్డ్ స్మిత్ నంచర్ల పరమేశ్ బహుమతులను అందజేశారు.

సోషల్ మీడియా వాడకం శృతిమించొద్దు

- తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్


మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

యాలాల: సోషల్ మీడియాను మంచికి వినియోగిస్తే ఎన్నో విషయాలకు పరిష్కారం లభిస్తుందని.. అది శృతిమించితే ప్రమాదమని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని ముద్దాయిపేటలో ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత బృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. డ్రంకెన్ డ్రైవ్, బాల్య వివాహాలు, పోక్సో తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. మైనర్లను డ్రైవింగ్‌కు ప్రోత్సహించొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం చేయొద్దని చెప్పారు. మద్యానికి దూరంగా ఉండాలని వివరించారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. యువకుత మీడియాను వ్యాపార, ఆర్థికాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ అరవింద్‌కుమార్, సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, మాజీ సర్పంచ్ బిచ్చన్నగౌడ్, గ్రామస్తులు సురేశ్, మహ్మద్‌ఖాన్, గోపాల్, రాజప్ప తదితరులు ఉన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

పెద్దేముల్: విద్యార్థుల చేతుల్లలోనే దేశ భవిష్యత్ ఉందని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోట్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటుగా అన్నిరంగాల్లోనూ ప్రావీణ్యం పెంచుకోవాలన్నారు. ప్రతీ వ్యక్తి ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధిలలో ముందుకెళ్తుందని సూచించారు. తల్లదండ్రులు విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో పోత్సహించాలన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలనిచెప్పారు. బాలికలను వేధించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గోపాలమిత్ర, పశుమిత్రల సమస్యలు పరిష్కరించండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

దౌల్తాబాద్: జిల్లాలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న గోపాలమిత్రలు, పశుమిత్రల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పశుమిత్రలు, గోపాలమిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పశుమిత్రలు పూజ, లావణ్య, వసంత, లక్ష్మి తదితరులున్నారు.

మహనీయుల ఉత్సవాలు ఆదర్శంగా నిర్వహిద్దాం

అనంతగిరి: మహనీయుల ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహిద్దామని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దళిత సంఘాల ప్రతినిధులు, నాయకులతో బాబు జగ్జీవన్‌రాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా డీఎస్‌డీఓ మల్లేశం, డీటీడీఓ కోటాజీ, డీబీడబ్ల్యూ ఉపేందర్, ఆర్డీఓ విజయకుమారితో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయులు సమాజాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో ప్రతినెల పౌరహక్కుల దినాన్ని పారదర్శకంగా నిర్వహించుకునేందుకు కృషి చేస్తానని అన్నారు. జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహం, బాబు జగ్జీవన్‌రాం భవన నిర్మాణాలకు జిల్లా యంత్రాంగం సహకారం ఉంటుందని తెలిపారు. సన్నాహక సమావేశంలో మాజీ ఉత్సవాల కమిటీ చైర్మన్లు రాజలింగం, శంకర్, రవీందర్, పెండ్యాల అనంతయ్య, మల్లేశం, శివరాజు, దేవదాసు, సురేశ్, ఆనంద్, కృష్ణ, మయూర్‌ఠాకూర్, జగదీష్, యాదయ్య, పెద్ది అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణం విషయంలో తగాదా

- వృద్ధురాలి బలవన్మరణం


రాములమ్మ(ఫైల్)

నవాబుపేట: కుటుంబ కలహాలతో ఓ వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన దాతాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని దాతాపూర్ గ్రామానికి చెందిన పెంటాల మల్‌రెడ్డి భార్య రాములమ్మ(65) గృహిణి. శుక్రవారం ఉదయం మల్‌రెడ్డి అతని కొడుకు విఠల్‌రెడ్డి బ్యాంకు రుణం విషయమై గొడవపడ్డారు. ఆ సమయంలో తండ్రీకొడుకులతో పాటు రాములమ్మ ఆమె కోడలు లక్ష్మి సైతం దూషించుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన రాములమ్మ మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో రాడ్‌కు ఉరేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చే వరకే రాములమ్మ మృతి చెందింది. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భరత్ భూషన్ తెలిపారు.

వీధికుక్కల దాడిలో లేగదూడ మృతి

దోమ : వీధి కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన మాలిస్ బాల్‌రెడ్డి అనే రైతు ఎప్పటిలాగే పశువులను పొలం నుంచి ఇంటికి తీసుకువచ్చి కట్టేశాడు. రాత్రి వేళ వీధి కుక్కలు లేగదూడపై దాడికి పాల్పడ్డాయి. లేగదూడ అక్కడికక్కడే మృత్యువాత పడింది.

కుక్కల దాడిలో పది జీవాలు మృతి యజమానికి గాయాలు

కేశంపేట: గొర్రెలు, మేకల మందతో పాటు యజమానిపైనా కుక్కలు దాడి చేసిన ఘటన మండల పరిధిలోని చింతకుంటపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనమోని వెంకటయ్య వ్యవసాయ పొలంలో రోజు మాదిరి గానే గొర్రెలు, మేకల మందను నెట్‌షెడ్‌లో ఉంచారు. శుక్రవారం ఉదయం కుక్కలు దాడికి పాల్పడటంతో 10 జీవాలు మృతి చెందాయి. యజమానిపైనా దాడికి దిగడంతో గాయాలయ్యాయి. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.